# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 02-04-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కల్పిస్తున్న ఇంటి వద్ద నుంచే ఓటింగ్ పోస్టల్ బ్యాలెట్ వినియోగంపైన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్రకు ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లా చీకటిమనిపల్లె నుంచి ప్రారంభం కానుంది.**
3. **ఆంధ్రప్రదేశ్ లో పింఛన్ల పంపిణీపై సవరించిన మార్గదర్శకాలను విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డి వెల్లడించారు.**
4. **తెలంగాణలో ఎన్నికల నియమావళి అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పోలీసుశాఖ, ఇతర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.**
5. **ఈరోజు ప్రపంచ ఆటిజం అవగాహన దినం నిర్వహిస్తున్నారు.**

==========================

మే నెలలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో కల్పిస్తున్న ఇంటి వద్ద నుంచే ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ వినియోగంపైన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్, ఇంటి నుంచే ఓటింగ్‌కు సన్నద్ధత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిన్న వెలగపూడి సచివాలయం నుంచి ముఖేష్‌కుమార్ మీనా జిల్లాల ఎన్నికల అధికారులకు దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో 85 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికిపైగా అంగవైకల్యం ఉన్నవారు ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకోవాలనుకుంటే ముందుగా రిటర్నింగ్ ఆఫీసరుకు ఫారం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకసారి ఇంటివద్ద నుంచే ఓటువేసే అవకాశం పొందితే వారు నేరుగా పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కోల్పోతారన్న విషయంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వివిధ శాఖల ఉద్యోగులు, సర్వీసు ఓటర్లకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రతి రిటర్నింగ్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

వైయస్ జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈరోజు చీకటిమనిపల్లె నుంచి ప్రారంభం కానుంది. ఈ యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి చీకటిమనిపల్లె నుంచి ఉదయం బయలుదేరి ములకలచెరువు, పెదపాలెం మీదగా వేపురికోట, బుర్రకాయలకోట క్రాస్, గొల్లపల్లి మీదుగా అంగళ్ళు చేరుకుంటారు. అనంతరం సాయంత్రం మదనపల్లె చేరుకుని టిప్పు సుల్తాన్ గ్రౌండ్ దగ్గర బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం నిమ్మనపల్లి క్రాస్, బోయకొండ క్రాస్, చౌడేపల్లి, సోమల మీదుగా అమ్మగారిపల్లె శివారులో రాత్రి బసకు చేరుకుంటారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్ల పంపిణీపై వివిధ జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డి దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల పంపిణీపై సవరించిన మార్గదర్శకాలను జారీ చేస్తామని ఆయన వెల్లడించారు.

---------------------------

తెలంగాణలో ఎన్నికల నియమావళి అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పోలీసుశాఖ, ఇతర విభాగాల అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. బేగంపేట, శంషాబాద్ విమానాశ్రయాల్లోనూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. రహస్య మార్గాలపై నిఘా పెంచాలని అన్నారు. నగదు అక్రమ రవాణా తదితర అంశాలపై ఇతర రాష్ట్రాల అధికారులతోనూ సమావేశాలు నిర్వహించామని అన్నారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా 85 సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీజీపీ రవి గుప్తా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్న ఆయన.. గత 15 రోజుల్లో 35 కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరిశ్రమలు, గోదాములపై నిఘా పెంచామని డిజిపి వెల్లడించారు.

---------------------------

భారత్ నుంచి రక్షణ రంగ ఎగుమతుల్లో వృద్ధి కనబరచామని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో 21 వేల 83 కోట్ల రూపాయల మేర రక్షణ ఉత్పత్తులు, సాంకేతికతలను విదేశాలకు సరఫరా చేసినట్లు ఆయన వెల్లడించారు. స్వతంత్ర భారత చరిత్రలో ఈ రంగంలో 21వేల కోట్ల మార్కును అధిగమించడం ఇదే తొలిసారని సామాజిక మాధ్యమాల వేదికగా రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 32.5 శాతం వృద్ధి నమోదైందని కేంద్ర ప్రభుత్వం.. రక్షణరంగంలో తయారీ, ఎగుమతులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు ఇటీవల గణనీయమైన పనితీరును కనబరిచాయని రాజ్‌నాథ్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మే 13న అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలు ఒకే విడతలో జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను నియమించింది. పోలీసులు, సాధారణ, ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించింది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా నిన్న రాత్రి విజయవాడ చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా స్వాగతం పలికారు.

---------------------------

పిల్లల్లో మంద బుద్ధి నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ ఆటిజం అవగాహనా దినం నిర్వహిస్తున్నారు. 2007వ సంవత్సరం డిసెంబర్ 18వ తేదీన ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం మేరకు 2008వ సంవత్సరం నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 2వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. కొందరు పిల్లలు చురుకుగా వ్యవహరించకుండా.. ఎవరితోనూ కలవకుండా.. ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం, సరిగా మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలు కలిగి ఉండడాన్ని మందబుద్ధి.. ఆటిజంగా పిలుస్తారు. తల్లి దగ్గరకు తీసుకుంటున్నప్పటికీ.. పెద్దగా స్పందించకపోవడం ఆటిజం మరొక లక్షణం. ఇటువంటి లక్షణాలు కలిగి ఉన్న పిల్లల మానసిక స్థితిని ముందుగానే పసిగట్టి వైద్యుల సలహా మేరకు చక్కని మానసిక శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో మార్పు తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ దాదాపుగా ఖరారు చేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో నిన్న జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ –సీఈసీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు ముఖ్య నాయకులు హాజరయ్యారు. 117 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులుగా పలువురి పేర్లకు ఆ పార్టీ అధిష్ఠానం ఆమోదం తెలిపిందని ఇంకా 58అసెంబ్లీ, 8 లోక్‌సభ స్థానాల అభ్యర్థుల ఎంపిక జరగాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

--------------------------

తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు వాయిదా పడింది. సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ రోజు జరగాల్సిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను జూన్ 2వ తేదీకి వాయిదా వేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. గత గురువారం ఈ స్థానానికి ఉప ఎన్నిక పోలింగ్ జరిగింది.

--------------------------

వేసవిలో తెలంగాణలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కాంగ్రెస్ నాయకులు, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో మంత్రి పర్యటించి పెద్దచెరువు పనులను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా.. అదనపు మోటార్లు ఏర్పాటు చేసుకోవాలని గ్రామ అధికారులకు సూచించారు.

--------------------------

దేశంలో అనేక ప్రాంతాల్లో ఏప్రిల్–జూన్ మధ్యకాలంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పలు ప్రాంతాల్లో తీవ్ర వేడి వాతావరణం ఉండే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా గుజరాత్, మధ్య మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, రాజస్థాన్, ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లలో వేడిగాలుల ప్రభావం తీవ్రంగా ఉండనుందని, దక్షిణాది రాష్ట్రాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపారు.. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, ఒడిశా, పశ్చిమ మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత అత్యంత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

--------------------------

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరగనున్న శ్రీ సీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలను భక్తులకు కూడా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ –టీఎస్ఆర్టీసీ తెలిపింది. ఈ తలంబ్రాలు కావాలనుకొనే వారు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో 151 రూపాయలను చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఏప్రిల్ 17న శ్రీరామనవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. తెలంగాణలోని అన్ని టీఎస్ఆర్టీసీ కౌంటర్లలో తలంబ్రాలను బుక్ చేసుకొవచ్చని తెలిపింది. తలంబ్రాల సేవను పొందాలనుకునే వారు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 040–23450033 సంప్రదించాలని అధికారులు సూచించారు.

======================